క్లుప్తంగా

నాలుగు సెల్ ఫోన్ల రికవరీ



సెల్‌ఫోన్స్‌ను బాధితులకు అందిస్తున్న ఎస్సై రమణ

భీమవరం: భీమవరం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మొబైల్ మిస్సింగ్ కేసుల్లో నాలుగు సెల్‌ఫోన్స్ రికవరీ చేసినట్లు రైల్వే ఎస్సై పీటీవీ రమణ శుక్రవారం చెప్పారు. ఈ సందర్భంగా బాధితులకు ఫోన్స్ అందజేశారు. సెల్‌ఫోన్స్ మిస్సింగ్ కేసుల్లో సీఈఐఆర్ యాప్ ద్వారా నాలుగు ఫోన్స్ రికవరీ చేయగా వాటి విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని ఎస్సై రమణ చెప్పారు.

నేడు మండల సోషల్ ఆడిట్

ఉండి: గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్, సామాజిక పింఛన్‌లు, పంచాయితీరాజ్ పనులపై నిర్వహించిన గ్రామ సోషల్ ఆడిట్ కార్యక్రమాలు ముగియడంతో శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు మండలస్థాయి సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్‌జరవీంద్ర తెలిపారు.ఈ కార్యక్రమానికి ఆయా శాఖలకు చెందిన అధికారులు వస్తున్న దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు,రైతులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

ఎస్ఆర్‌కేఆర్‌కు బెస్ట్ పెర్ఫార్మింగ్ అవార్డు



అవార్డు అందిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు బెస్ట్ పెర్ఫార్మింగ్ అవార్డు దక్కిందని కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. కళాశాలకు అవార్డు వచ్చిన సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపాల్ కెవి మురళీకృష్ణంరాజులను సత్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ నెల 20న కాకినాడలో జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూకే) విశ్వవిద్యాలయం 16వ వార్షికోత్సవం సందర్భంగా ఉన్నత ఉద్యామండలి ఛైర్మన్ కె.మోహన్‌రావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ చేతుల మీదుగా అవార్డు సత్కారం అందుకున్నామన్నారు. జేఎన్టీయూకే పరిధిలో 162 ఇంజినీరింగ్ కళాశాలలుండగా వాటిలో 10 కళాశాలలను అవార్డుకు ఎంపిక చేయగా తమ కళాశాలప్రథమ స్థానంలో నిలిచి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు సాగి ప్రసాదరాజు, సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

టెలీ కాలింగ్ ద్వారా హోమియో వైద్యం



ఉచిత మొబైల్ వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: టెలీ కాలింగ్ ద్వారా రోగులకు ఉచితంగా హోమియో మందులను పాలకొల్లుకు చెందిన డాక్టర్ కోసూరి రామ కృష్ణానంద రాజు(డాక్టర్ పోడూరు రాజు) అందజేస్తున్నారు. శుక్రవారం మండలంలోని కోరుకొల్లు గ్రామంలోని బస్‌స్టాప్ వద్ద ఉచిత మొబైల్ హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మంది రోగులకు మొబైల్ ద్వారా రోగి లక్షణాల్ని హోమియో వైద్యులు పోడూరు రాజుకు తెలియజేయడంతో ఆయన తగిన హోమియో పిల్స్ చెప్పడంతో బృందం శిబిరంలో అందజేస్తున్నారు.

డయల్ యువర్ డీఎంకు మూడు ఫిర్యాదులు

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు అందినట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. మత్స్యపురి మీదుగా నడుపుతున్న బస్సులు మేదర్ల వెంతెన మీదుగా కాకుండా వేరే రూట్‌లో నడపాలని, విజయవాడకు నరసాపురం బస్టాండ్ నుంచి నేరుగా బస్సులు నడపాలని, మార్టేరు మీదుగా హైదరాబాద్‌కు బస్సు ఏర్పాటు చేయాలని కోరిటనట్టు చెప్పారు. ఈ అంశాలను పరిశీలిస్తున్నామని వివరించారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా శుక్రవారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో జరిగిన ఈ హోమంలో 8 మంది దంపతులు పాల్గొన్నారు. అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాన్ని, ప్రసాదం అందజేశారు.



భయాందోళనలో వైద్య వర్గాలు..



ఆస్పత్రిలో రాత్రి సమయంలో విధుల్లో ఉండే మహిళా వైద్యులు, నర్సులు భయాందోళనతో విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్యం కోసం కొందరు, తగాదాల్లో కొందరు ఆస్పత్రికి వచ్చే పరిస్థితుల్లో మద్యం మత్తులో రావడం వైద్యవర్గాలపై దాడులకు దిగుతున్నారు. నైట్ డ్యూటీ చేయాలంటే మహిళలు భయపడుతున్నారు. ఆస్పత్రిలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి వైద్య వర్గాలకు రక్షణ కల్పించాలి.

– వైవీఎస్‌బీ రాయుడు, ఏపీపీపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి, తణుకు

దోషులను శిక్షించాలి



పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన అటవిక చర్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా సంఘటన దురదృష్టకరం. వైద్యశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. ఆస్పత్రిలోకి వచ్చే బయట వారిపై సరైన నిఘాపెట్టాలి. మత్తు పదార్థాలు సేవించేవారిపై చర్యలు తీసుకోవాలి

– డాక్టర్ పూజిత, ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి

సమస్యల పరిష్కారానికి శ్రీకారం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

వీరవాసరం: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి స్వర్ణ గ్రామాలు అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వీరవాసరం మండలం వీరవాసరం గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ సభలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలో గ్రామాల్లో నిర్వహణతో సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక కార్యాచరణ రూపొందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి గ్రామ నిర్మాణంతో గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. ఉపాధి హామీ పనులు నాణ్యతతో చేయాలని వీటిపై సోషల్ ఆడిట్ కూడా నిర్వహిస్తామన్నారు. ఎక్కువ మందికి పని కల్పించడం ద్వారా మెటీరియల్ కాంపోనెంట్ పొందగలుగుతామని దాని ద్వారా గ్రామంలోని రోడ్లు, డ్రెయిన్‌లు ఏర్పాటుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, డ్వామా పీడీ ప్రభాకర్ రావు, ఐసీడీస్ పీడీబీ సుజాత రాణి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పార్థసారథి, సర్పంచ్ చికిలే మంగతాయారు, జెడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్ నాయుడు, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, ఎంపీటీసీ సభ్యుడు కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రామ సభలు

ఉండి: గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామ సభల ద్వారా తీర్మానించుకుని పరిష్కరించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహదేవపట్నం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా జాయింట్ కలెక్టర్ హాజరై గ్రామ సభ నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను గ్రామ సభలో తీర్మానించుకుని ఉన్నతాధికారులకు పంపితే వారు ప్రభుత్వానికి పంపుతారని వీటి విషయంలో ప్రభుత్వం విడుదల చేసే నిధులతో ప్రాధాన్యతా క్రమంలో పనులు నిర్వహించి సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీ,జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, ఎంపీడీఓ ఎస్.రవీంద్ర,ఈవోపీఆర్డీ రామకృష్ణంరాజు,వనిమా శ్రీనివాస్,కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కోలమూరులో సర్పంచ్ నడింపల్లి సత్యవతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు,గ్రామ ఉపసర్పంచ్ నడింపల్లి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో రూ.9 కోట్ల విలువైన పనులను ప్రతిపాదించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ పేరిచెర్ల సుభాష్‌రాజు మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. చెరుకువాడలో నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, కార్యదర్శి కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరం గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నాగరాణి



మహదేవపట్నంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



చెరుకుమిల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం



యనమదుర్రులో గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధి పనుల్లో నాణ్యత పెరగాలి

ఆకివీడు: ఉపాధి పనుల్లో నాణ్యత పెరగాలని ఎంపీడీఓ కందుల వాణి సూచించారు. మండలంలోని గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు జరిగాయి. అయిభీమవరం గ్రామ సభలో ఎంపీడీఓ మాట్లాడుతూ తూతూ మంత్రంగా ఉపాధి పనులు చేపడితే కుదరదన్నారు. గతంలో 40 శాతం పని కూడా చేసేవారు కాదన్నారు. ఉపాధి పనుల్లో నాణ్యత పెరగాలన్నారు. ఇంటి వద్ద ఉండి మస్తర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం సూచించిన 24 పనులను చేపట్టి ఉపాధి కూలీలకు పూర్తి స్థాయిలో పని కల్పించాలన్నారు. మంచినీటిచెరువులు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, స్మశాన వాటికలు, రహదార్ల వెంబడి పిచ్చిమొక్కల తొలగింపు, పంట, మురుగు కాల్వల్లో తూడు తొలగింపు తదితర పనులున్నాయని చెప్పారు. అయిభీమవరం, చెరుకుమిల్లి సర్పంచ్‌లు గాలి సామ్రాజ్యం, నందమూరి ప్రకాశం మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధికి ఉపాధి నిధులు వినియోగించుకునే అవకాశం వచ్చిందన్నారు. అయిభీమవరం గ్రామంలోని మంచినీటి చెరువు నీరు కలుషితానికి గురైందని గ్రామ పెద్ద కనుమూరు కృష్ణంరాజు గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దృష్టికి సమస్యను ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే సొంత గ్రామంలో మంచినీటి సమస్యను పట్టించుకోరా అని ప్రశ్నించారు. సంబంధిత అధికారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ వాణి చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆనంద భూషణం, ఏఓ ప్రియాంక, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సైదాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరంలో..

భీమవరం అర్బన్: తెల్లరేషన్ కార్డుదారులందరికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథక లక్ష్యమని ఈవోపీఆర్‌డీ జేవీ నామేశ్వరరావు అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈఓపీఆర్‌డీ నామేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో ఎన్నార్జీఎస్ ద్వారా 100 పనిదినాలు కల్పించి 15 రోజుల్లో వేతనాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరబత్తులు రామూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కొత్తపూసలమర్రు, దిరుసుమర్రు, వెంప, అనాకోడేరు, కొమరాడ, ఎల్‌వీఎన్‌పురం, బేతపూడి, జొన్నలగరువు, తుందుర్రు, పెదగరువు, శ్రీరామపురం, దొంగపిండి, లోసరి తదితర గ్రామాలలో శుక్రవారం గ్రామ సభలు జరిగాయి. ఈ సభలలో ఎన్నార్జీఎస్ పనులు గురించి గ్రామస్తులకు వివరించారు.

'గుడ్ టచ్-బ్యాడ్ టచ్'పై అవగాహన



ఆదిత్య స్కూల్లో న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న యోహాను

భీమవరం: విద్యార్థులు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌ల మధ్య వ్యత్యాసాన్ని ముందుగానే తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి యోహాను అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆదిత్య స్కూల్లో భీమవరం మండల న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గుడ్ టచ్-బ్యాడ్ టచ్, ఫండమెంటల్ రైట్స్ అండ్ డ్యూటీస్, చైల్డ్ లేబర్, చైల్డ్ బెగ్గింగ్, విద్య హక్కులకు సంబంధించి న్యాయ విజ్ఞానసదస్సులో ఆయన మాట్లాడారు. ఎవరైనా బ్యాడ్ టచ్ చేస్తే నిరోధించడమేగా ఆ విషయాన్ని స్కూల్ యాజమాన్యం, తల్లితండ్రులకు వెంటనే తెలియజేయాలన్నారు. అపరిచితుల పట్ల అప్రమతంగా ఉండాలని రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులుపైన కూడా విద్యార్థులు అవగాహనా కలిగి ఉండాలన్నారు. ఈ సదస్సులో న్యాయవాదులు ఎ.విజయకుమార్, సత్యవిజ్ఞానదేవి, పి.అంబేద్కర్, బి.లోకేష్ కుమార్, ఎ తేజ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు బిందెలతో జలాభిషేకం



జలాభిషేకం చేసేందుకు నీళ్లను తీసుకువస్తున్న మహిళలు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో మారమ్మ, భూలక్ష్మి వెంకమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బిందెలతో మంచినీటి చెరువులోని నీటిని తీసుకువచ్చి పసుపు, వేపాకులతో అమ్మవార్లకు జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక సహస్ర కుంకుమార్చన, శాంతి హోమం, కుంభపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



మావుళ్లమ్మ ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తుల



సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు చేయిస్తున్న ప్రధాన అర్చకులు చిన్ని



పెద్దింటి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద 700 మంది మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ(చిన్ని) సంప్రదాయ బద్ధంగా మహిళలతో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ గాత్ర సంగీత విద్వాంసురాలు గిన్నిస్ వరల్డ్ గ్రహిత స్వరాజ్యలక్ష్మి సంప్రదాయ సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం భక్తులందరికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీ వ్రతాలు నోచుకున్నారు. ఆలయ అర్చకులు మొవ్వా చందు ఆధ్వర్యంలో వ్రతం, పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. భక్తులకు పూజా సామాగ్రిని అందజేశారు. అమ్మవారిని గజమాలతో అలంకరించారు. వ్రతం అనంతరం భక్తులు ప్రసాద వితరణ చేశారు.

అమ్మవారికి బంగారు నాంతాడు అందజేత

విజయవాడకు చెందిన డాక్టర్ మేఘన కుటుంబికులు పెద్దింటి అమ్మవారికి రూ. 57 వేల విలువైన బంగారు నాంతాడును శుక్రవారం అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత ఆలయ కార్యనిర్వాహణాధికారి అల్లూరి సత్యనారాయణరాజుకు నాంతాడును అందజేశారు. కార్యక్రమంలో కిమిడి నాగరాజు, పెద్దిరాజు, యాళ్లబండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో శ్రావణమాస పూజలు

ఉండి: స్థానిక శ్రీరామక్షేత్రంలో శ్రావణమాసం మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు.సామూహిక కుంకుమపూజ,లక్ష్మీపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 25న శ్రీరామక్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గుండాబత్తుల సుబ్బారావు తెలిపారు. 28న శ్రీరామక్షేత్రంలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆనంద్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి



కొవ్వాడ అన్నవరంలో పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్

భీమవరం అర్బన్: వ్యవసాయంలో భూ సార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సాగులో విచక్షణ రహితంగా ఎరువులు వాడితే ఖర్చులు పెరిగిపోతాయన్నారు. భూ సార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో అంతే వాడాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వాడకూడదని చెప్పారు. అలాగే పురుగు మందులు ఎక్కువగా వాడటం వల్ల మిత్ర, శత్రు పురుగులు మృత్యువాత పడతాయని మిత్రపురుగులను రక్షించుకునేందుకు తక్కువగా వాడాలన్నారు. వరినారి దొరకని రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరించాలన్నారు. ఈ విధానం వల్ల రెండు వారాలు సమయంతో పాటు సుమారు రూ. 5 వేలు వరకు ఖర్చు ఆదా అవుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాసు మాట్లాడుతూ వరినాట్లు వేసిన రైతులు తప్పకుండా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. పొలం బడి 14 వారాల పాటు జరుగుతాయన్నారు. సాగులో సమస్యలు, అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు స్వేత, మౌనిక, సుందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాళ్ల: లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటనపై కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది.కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం దొడ్డనూడి గ్రామానికి చెందిన పోతురాజు ఇస్మాయేల్, తెనాలి అబ్రహం ద్విచక్ర వాహనంపై 22న గురువారం మధ్యాహ్నం దొడ్డనపూడి నుండి కాళ్ల గ్రామం వెళుతుండగా పాత ఇనుపసామగ్రి కొట్టు వద్దకు వచ్చే సరికి ఎదురుగా రాంగ్‌రూట్లో వస్తున్న లారీ ఢీ కొట్టడంతో బండి నడుపుతున్న ఇస్మాయేల్ కుడికాలు ముక బయటకురావడంతో పాటు వెనుక కూర్చున్న అబ్రహంకు గాయాలు కావడంతో ఇస్మాయేల్ సోదరుడు భీమవరంలోని ఓ ప్రైవేటను ఆసుపత్రికి తరలించి వారికి చికిత్స అందిస్తున్నారు.ఆసుపత్రిలో బాధితుడు ఇస్మాయేల్ ఇచ్చిన స్టేట్మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీఎన్నార్ కళాశాల పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



భీమవరం డీఎన్నార్ కళాశాలలో పీజీ కోర్సెస్ పరీక్షా ఫలితాలు విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాల పీజీ కోర్సెస్ రెండు, నాలుగో సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు శుక్రవారం విడుదలజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా డీఎన్నార్ కళాశాలలో నాణ్యమైన విద్యనందిస్తున్నామని, మార్కెట్ అవసరాలకు, నూతన టెక్నాలజీలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ మాట్లాడుతూ ఫలితాల్లో నాలుగో సెమిస్టర్‌లో ఎంఏలో 93 శాతం, ఎంకామ్‌లో 100 శాతం, ఎంబీఏలో 99 శాతం, ఎంసీఏలో 100 శాతం, ఎంఎస్సీలో 82 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.శ్రీనివాసరాజు, అసిస్టెంట్ కంట్రోలర్ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం



పీఎస్ఎం స్కూల్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక పొట్టిశ్రీరాములు మునిసిపల్ గరల్స్ (పీఎస్ఎం) హైస్కూల్లో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడిగా, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజల మనసులో ప్రకాశంపంతులు త్యాగం, సాహసం భావితరాలకు ఆదర్శనీయన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్‌లో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నామని దీనికి దాతలు సహకారం అందిస్తున్నారన్నారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా పట్టణంలోని వివిధ పాఠశాలల్లో మూడు రోజులు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, డిక్షనరీలు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో తొలగించిన పనులు చేర్చాలి

భీమవరం అర్బన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో తొలగించిన పనులను చేర్చాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఎన్నార్జీఎస్‌లో తొలగించిన పనులను చేర్చాలని ఈవోపీఆర్‌డీ నామేశ్వరరావుకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మందా మార్తమ్మ, చిలకపాటి శకుంతల, ఇంజేటి మరియమ్మ ఉన్నారు.

ఫెర్రీ వేలానికి ఆరు షెడ్యూళ్ల అమ్మకం

నరసాపురం రూరల్: కీలకమైన నరసాపురం - మాధవాయిపాలెం రేవు పాటను ఈనెల 28న నిర్వహించనున్నారు. సీల్డ్‌కం బహిరంగ పద్ధతిలో జరగనున్న ఈ వేలంపాటకు సంబంధించి టెండరు షెడ్యూళ్ల అమ్మకం చివరి రోజు నాటికి ఆరుగురు టెండరు షెడ్యూళ్లు కొనుగోలు చేసినట్లు ఎంపీడీఓ కె.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. ది నరసాపురం శాండ్ క్వారీ బోట్స్‌మెన్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ, ది లక్ష్మీపాలెం శాండ్ క్వారీ బోట్స్‌మెన్ ఫీల్డ్ లేబర్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ, ది కనక దుర్గా శాండ్ క్వారీ బోట్స్‌మెన్ ఫీల్డ్ లేబర్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ, అమరేశ్వర మెరైన్ ఫిషర్‌మెన్ ల్యాండ్ క్వారీ బోట్స్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ, నరసాపురానికి చెందిన భూపతి మంగయ్య నాయుడు, రౌతుల రఘుబాబు అనే ఆరుగురు టెండరు షెడ్యూళ్లు కొనుగోలు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

లంకలకోడేరు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వాసుపత్రిల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్యులు, సిబ్బంది సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు, జనరల్ వార్డు, తదితర విభాగాలను సందర్శించారు. ఆసుపత్రిలో ఓపీ, ప్రసవాలు, జ్వరాల కేసుల వివరాలను వైద్యులు కలెక్టర్‌కి వివరించారు. ఓపీ రిజిస్టర్, ఎన్సీరిజిస్టర్, టీబీ కేసుల నమోదు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జన్మించిన శిశువుకి పుట్టిన తేదీ సర్టిఫికెట్‌ను కలెక్టర్ నాగరాణి శిశువు తల్లికి అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ ఉన్నారు.